
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
శనివారం 14 - 12 - 2024

# అనంత రైతాంగాన్ని ఆదుకోండి



- పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందించాలి
- వరి, వేరుశనగ, మొక్కజొన్న, పత్తి తదితర పంట ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేయాలి
- రైతులపై ప్రీమియం భారం వేయకుండా 'ఉచిత పంటల బీమా' పునరుద్ధరించాలి
- రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ డ్రిప్, స్ప్రింక్లర్లు అందించాలి
- 2023 ఖరీఫ్ పంటల బీమా పరిహారం చెల్లించాలి
- 2023 రబీ కరువు మండలాల రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించండి
- మార్కెటింగ్ వ్యవస్థలో దళారుల ప్రమేయాన్ని అరికట్టండి
- ఆర్‌ఎస్‌కేల్లోనే విత్తనాలు, ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్‌ను అందించాలి
- జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మకు వైఎస్‌ఆర్‌సీపీ నేతల వినతి
- అనంతపురంలో భారీ ర్యాలీ నిర్వహించిన వైసీపీ శ్రేణులు



అనంతపురం, డిసెంబరు 13 (అనంతప్రభ )
"ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన అన్నదాతలకు నేడు అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. ఓ వైపు అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతింటే.. మరో వైపు అరకొరగా చేతికొచ్చిన పంటను అమ్ముకుందామన్నా గిట్టుబాటు ధర లభించడం లేదు. జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. రాజస్థాన్‌లో ఉన్న జైసల్మేర్ తర్వాత అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం అనంతపురం జిల్లా. నిత్యం కరువు కాటకాలతో ఇక్కడి రైతులు ఓ యుద్ధమే చేస్తున్న పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతాంగం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. తక్షణం రైతాంగం సమస్యలను పరిష్కరించాలి" అని వైఎస్‌ఆర్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 'అన్నదాతలకు అండగా వైఎస్‌ఆర్‌సీపీ' నినాదంతో శుక్రవారం నగరంలో భారీ నిర్వహించారు. ముందుగా జెడ్పీ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ వైఎస్‌ఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీ ప్రారంభించి సప్తగిరి సర్కిల్, సూర్య నగర్ రోడ్డు, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగించారు. జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గాల సమన్వయకర్తలు విశ్వేశ్వరరెడ్డి, తలారి రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వీరాంజనేయులు, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మేయర్ వసీం ఇతర ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వచ్చారు. కలెక్టరేట్ వద్ద నేతలు ప్రసంగించాక జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మకు వినతిపత్రం అందజేశారు. అనంతపురం జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వినతిపత్రంలో ఏముందంటే.. అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3,46,741 హెకార్లు. ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమైన ఖరీఫ్ సీజన్ సెప్టెంబర్ మాసంతో ముగియగా 3,20,071 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ప్రధాన పంట వేరుశనగ సాధారణ సాగు 1,97,884 హెకార్లు ఉండగా ఈ ఏడాది కేవలం 1,11,922 హెక్టార్లలో (57 శాతం) మాత్రమే సాగు చేశారు. జూన్, ఆగస్టు మాసాల్లో అధిక వర్షపాతం.. జూలై, సెప్టెంబర్‌లో తక్కువ వర్షపాతం నమోదైంది. మొత్తంగా ఖరీఫ్ సీజన్‌లో 34.9 శాతం అధిక వర్షపాతం నమోదు కావడంతో పంటలన్నీ దెబ్బతిన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు తోడుగా ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించింది. ఉష్ణోగ్రతలు, వర్షపాతం, వాతావరణ పరిస్థితి, పంటల సాగు విస్తీర్ణం, పంట కోత ప్రయోగాలు, వాటి దిగుబడులు దాదాపు జిల్లాలోని 31 మండలాల్లోనూ అటుఇటుగా ఉన్నా కేవలం 7 మండలాలను మాత్రమే కరువు జాబితాలో చేర్చింది. ప్రకటించిన కరువు మండలాల్లోనూ రైతులకు న్యాయం జరగని పరిస్థితి. చివరకు ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు అందించే ఇన్‌పుట్ సబ్సిడీ పరిహారాన్ని పరిహాసంగా మార్చారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను అంచనా వేయకుండా అరకొరగా నష్టం అంచనాలు వేశారు.

రబీ సీజన్‌లోనూ రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం జిల్లాలో 1.18 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి రావచ్చని అధికారులు అంచనా వేశారు. రబీలో ప్రధాన పంట కింద పప్పుశనగ 72,909 హెక్టార్లలో సాగులోకి వస్తాయని అంచనా వేసినా ఇప్పటి వరకు 58 వేల హెక్టార్లలో మాత్రమే సాగయ్యింది. ఇదే సమయంలో పప్పుశనగ రాయితీలో రాష్ట్ర ప్రభుత్వం కోత విధించింది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో 40 శాతం సబ్సిడీతో పప్పుశనగ అందిస్తే ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో 25 శాతానికి పరిమితం చేశారు.

ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల్లో ఇప్పటికే వరి, మొక్కజొన్న, కందులు, వేరుశనగ, పత్తి, ఆముదం పంటలు చేతికొచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటంగా మద్దతు ధర ప్రకటించినా జిల్లాలో పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు.

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతులు పంటలు వేసుకునే సమయంలోనే 'వైఎస్‌ఆర్ రైతు భరోసా' పథకం కింద పెట్టుబడి సాయంగా ఏటా రూ.13500 అందజేశాం. ఇలా 2019 నుంచి 2023 వరకు ఐదేళ్ల కాలంలో అనంతపురం జిల్లా రైతాంగానికి ఏకంగా రూ.1900 కోట్లు పెట్టుబడి సాయంగా అందింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఏటా రైతులకు 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడం దారుణం.

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న అనంతపురం జిల్లాలో నీటి వనరులను తగిన రీతిలో వాడుకోవాలంటే సూక్ష్మ సాగు పద్ధతులు అవలంభించాలి. ఇందుకోసం రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు అందించాల్సిన అవసరం ఉంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 41 వేల మంది రైతులు 57 వేల హెక్టార్లకు సబ్సిడీతో బిందు, తుంపర పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42,100 హెక్టార్ల లక్ష్యం పెట్టుకున్నా ఇప్పటి వరకు 2,500 హెక్టార్లకు మించి పరికరాలు

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్



శింగనమల, డిసెంబరు 13 (అనంతప్రభ )
శింగనమల నియోజకవర్గం,గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయగానే 48 గంటల్లోపు వారి అకౌంటుకు డబ్బు జమ చేయడం జరుగుతుందన్నారు. 1 క్వింటా ధాన్యం బస్తా 2300 రూపాయలు గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. లోడింగ్ కూలీలు,రవాణా చార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తుంది అని తెలిపారు. రైతులు రైతు సేవ కేంద్రంలో పంట నమోదు చేసుకొని ఉంటే చాలు రైతు వద్దకు నేరుగా వ్యవసాయ అధికారులే వచ్చి ధాన్యం తీసుకెళ్తారని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో 90 శాతం డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కే దక్కుతుందని తెలియజేశారు.వైసీపీ ప్రభుత్వంలో ఒక జానడు డ్రిప్ కూడా ఇవ్వలేని పరిస్థితి చూసాం.రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్,ఇన్ పుట్ సబ్సిడీ కూడా ఇవ్వలేని దద్దమ వైసిపి ప్రభుత్వం అని మండిపడ్డారు.మీరు రైతులకు ఎం చేశారో చెప్పండి అంటూ వైసీపీ నాయకులను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ప్రశ్నించారు.వైసీపీ నాయకులు చేస్తున్న దొంగ ధర్నాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవ నాయుడు , ఎమ్మార్వో.ఈరమ్మ యోగానంద రెడ్డి సివిల్ సప్లైస్ ఆఫీసర్ రమేష్ రెడ్డి,కార్పొరేట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్ అరుణకుమారి సోమశేఖర్ ,ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరస నాయుడు , కేశవరెడ్డి మాజీ ఎంపీపీ శ్రీ

## "అన్నదాతకు అండగా వై.యస్.ఆర్.సి.పీ" ర్యాలీలో పాల్గొన్న శ్రీమతి బోయ గిరిజమ్మ




అనంతపురం, డిసెంబరు 13 (అనంతప్రభ )
అనంతపురం రైతాంగం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించిన "అన్నదాతకు అండగా వై.యస్.ఆర్.సి.పీ" ర్యాలీలో వై.యస్.ఆర్.సి.పీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి, ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి బోయ గిరిజమ్మ గారు పాల్గొన్నారు. కార్యక్రమంలో మొదటగా రాజ్యంగా రూపకర్త డా.బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించి, ర్యాలీగా కలెక్టరేట్ ను చేరుకున్నారు. అనంతరం రైతు సమస్యలపై జాయింట్ కలెక్టరు గారికి కు వినతిపత్రం సమర్పించి వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసారు, ఈ సందర్భంగా చైర్ పర్సన్ ఆగారు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక రైతు అలాంటి రైతు కు వెన్నెముక విరిగేలా కూటమి ప్రభుత్వం రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం క్రింద పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20,000 ఇస్తామని మొండి చేయి చూపించారని, వరి,వేరుశనగ,మొక్కజొన్న, ఇతర పంటలకు కనీస మద్దతు ధర కలిపించాలేదని, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని, సూపర్ సిక్స్ హామీలను ఏవి అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించి, కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, వై.యస్.ఆర్.సి.పీ ప్రభుత్వంలో ఉన్నపుడు వ్యవసాయం దండగ అన్న రైతన్నలకు వ్యవసా-యం పండగలా చేసారని, ప్రస్తుతం కూడా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమం, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతుల పక్షాన పోరాటానికి ఎప్పటికి సిద్దంగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు, మాజీ శాసన సభ సభ్యులు, మాజీ పార్లమెంట్ సభ్యులు, నగర పాలక సంస్థ మేయరు, డిప్యూటి మే-యర్లు, మునిసిపల్ చైర్ పర్సన్లు, జడ్.పి.టి.సి.లు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు

## జేసీప్రభాకర్ రెడ్డి పామిడి పట్టణంలో విలేకరుల సమావేశం



తాడిపత్రి , డిసెంబరు 13 (అనంతప్రభ )
ఈసమావేశంలో జేసి ప్రభాకరరెడ్డి గారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో తనపై అక్రమ కేసులు బనాయించిన అధికారులపై కేసులు నమోదు చేయాలని కోరుతూ 24-07-2024 వ తేదీన అనంతపురం జిల్లా ఎస్పి కి మరియు అనంతపురం 1వ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా కూడా ఎటువంటి స్పందన లేక పోవడం చేత నేడు అనంతపురం జిల్లా జడ్జి గారికి ఫిర్యాదు చేశా నని జేసి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం పోలీసుల ప్రథమ కర్తవ్యం అని , విచారణలో నిజా నిజాలు నిర్ధారించిన తరువాత ఎఫ్ ఐ ఆర్ పేర్లను చేర్చడం తొలగించడం చేయవచ్చని కానీ ఫిర్యాదు చేసిన 5 నెలలకు కూడా ఎఫ్ ఐ ఆర్ కూడా నమోదు చేయకపోవడం భాదగా ఉందని ఆయన అన్నారు.ఈ విషయం పై తనకు న్యాయం జరిగే వరకు హైకోర్ట్ లేదా సుప్రీం కోర్ట్ ను కూడా ఆశ్రయిస్తాను అని ఆయన తెలిపారు.

## రైతు సమస్యల ర్యాలీలో పాల్గొన్న మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు



యాడికి, డిసెంబరు 13 (అనంతప్రభ )
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రములోని ప్రతి ఒక్క జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రైతు సమస్యలపై వినతిపత్రం అందజేయాలన్న ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా కేంద్రం నందు జిల్లా కలెక్టర్ గారికి రైతు సమస్యలపై వినతిపత్రం ఇచ్చే కార్యక్రమంలో జిల్లా వైసీపీ నాయకులతో కలిసి యాడికి వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వెంకటనాయుడు, అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, వార్డ్ సభ్యులు గుంత తిరుపతి, గజ్జి బాలపెద్దయ్య, మండల ప్రధాన కార్యదర్శి కోట చౌదరి, గుర్రాల కంబగిరిరాముడు, శివయ్య తదితరులు పాల్గొన్నారు

## ఓవర్ లోడింగ్ ఆటోలలో ప్రయాణిస్తే ప్రాణాలకే ముప్పు, సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు



కూడేరు, డిసెంబరు 13 (అనంతప్రభ )
అనంతపురం జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఓవర్ లోడింగ్ ఆటోలపై శుక్రవారం రోజున సిఐ రాజు,వారి సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు.,కూలీ పనుల కోసమని మరియు ఇతర ఏ అవసరాలకైనా ఓవర్ లోడింగ్ తో వెళ్తున్న ఆటోలలో ప్రయాణిస్తే ప్రాణాలకే ప్రమాదనమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కూడేరు పోలీసులు ఆటోలో ప్రయాణించే ప్రయాణికులకు సూచించారు.కూడేరు బళ్ళారి రహదారిపై ప్రత్యేకించి ఓవర్ లోడింగ్ ఆటోలపై తనిఖీలు ప్రత్యేకంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఆటోను ఆపి పరిమితికి మించి ప్రయాణీకులను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆటో డ్రైవర్లకు తెలియజేశారు,రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆటో వాహనం ఆర్సి బుక్కులు, డ్రైవర్ యూనిఫారం, తప్పకుండా దగ్గర ఉండాలని, ఆటోలో ప్రయాణించేటప్పుడు, సౌండ్ బాక్సులు డీజే లు తగ్గించుకోవాలని, ఆటో నడిపేటప్పుడు వెనక ముందు చూసుకొని చాలా జాగ్రత్తగా ప్రయాణికులను గమ్య స్థలం చేర్చాలని అతివేగం ప్రాణానికే ప్రమాదం ఆటో డ్రైవర్లకు తగు సూచనలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ లు,శివ శంకర్, రామానాయుడు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశులు, పోలీసులు నరసింహారాజు, నరసింహులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు



యాడికి, డిసెంబరు 13 (అనంతప్రభ )

యాడికి మండలంలోని రెండు సాగునీటి సంఘాలకు నేడు జరిగే ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రాయలచెరువు, పిన్నేపల్లి గ్రామ సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల అధికారులకు, సహాయ పోలింగ్ అధికారులకు చందన గ్రామ సచివాలయం నందు తహసిల్దార్ ప్రతాపరెడ్డి, ఎంపీడీవో వీర్రాజు, మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు, నీటి పారుదల శాఖ ఇంజనీర్ సలీం భాష ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది, రాయలచెరువు సాగునీటి సంఘాల ఎన్నికలలో 325 మంది ఓటర్లు ఉన్నారని, పిన్నేపల్లి సాగునీటి సంఘాల ఎన్నికలలో 85 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు

# చందన గ్రామంలో రెవెన్యూ సదస్సు




యాడికి, డిసెంబరు 13 (అనంతప్రభ )

భూమి మరియు ఇతర రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని యాడికి మండల తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి తెలిపారు, శుక్రవారం యాడికి మండలం చందన గ్రామంలో రెవెన్యూ మరియు మండల అధికారుల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో భూ సమస్యలు మరియు ఇతర రెవెన్యూ సమస్యలను ప్రజలు తెలియజేస్తే వాటి పరిష్కారం దిశగా మేము ప్రయత్నం చేస్తామని, ఈ రెవిన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు, అనంతరం ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగేశ్వర్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ మరియు సచివాలయ సిబ్బంది, దేవాదాయ,అటవీ శాఖ అధికారులు, రైతులు గ్రామ ప్రజలు, పాల్గొన్నారు

# మీనా వాటర్ ప్లాంటును ప్రారంభించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్




అనంతపురం, డిసెంబరు 13 (అనంతప్రభ )

చాకలి ఐలమ్మ కాలనీలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి లింగమయ్య సతీమణి సి.మీనా పేరుమీద ఉన్న వాటర్ ప్లాంట్ ను శుక్రవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్, సిపిఐ జిల్లా కార్యదర్శి సి జాఫర్, సిపిఐ జిల్లా జాయింట్ సెక్రెటరీ సి మల్లికార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నివసిస్తున్న ప్రజలు కలుషితమైన నీళ్లు తాగడం వల్ల అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న సి. మీనా ప్యూరిఫైడ్ అండ్ డ్రింకింగ్ అండ్ కూల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్ శ్రీరాములు, రాప్తాడు నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి రామకృష్ణ, వాటర్ ప్లాంట్ రామసుబ్బయ్య, చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సివి హరికృష్ణ, ఐలమ్మ కాలనీ సిపిఐ కార్యదర్శి నాగరాజు, చేతి వృత్తిదారుల సమాఖ్య నగర అధ్యక్షులు ఫైటర్ భూషణ, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణపై అధికారులతో ప్రత్యేక సమావేశం



శింగనమల, డిసెంబరు 13 (అనంతప్రభ )

శింగనమల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న సాగునీటి సంఘం ఎన్నికలపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు తహశీల్దార్ బ్రహ్మయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘం ఎన్నికలలో అధికారులు ,పోలింగ్ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా సిఐ కౌలుట్లయ్య మాట్లాడుతూ సాగునీటి సంఘం ఎన్నికకక పోలింగ్ లో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.వెంటనే చర్యలు తీరుకుంటామని తెలాయజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మల కుమారి,ఎఓ అన్వేష్ కుమార్ ,ఎస్ఐ శరత్ చంద్ర, వివిధ శాఖల అధికారులు,పోలింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# సిమెంట్ రోడ్డు పనులను పర్యవేక్షించిన సర్పంచ్ వడ్డే రమాదేవి భర్త రాజు



కూడేరు, డిసెంబరు 13 (అనంతప్రభ )

కూడేరు మండలం స్థానిక మండల పరిధిలోని చోళ సముద్రం గ్రామం నందు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు చొరవతో స్థానిక సర్పంచ్ వడ్డే రమాదేవి ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. చోళ సముద్రం గ్రామపంచాయతీ నందు తనను నమ్ముకున్న ప్రజల కోసం సర్పంచ్ గా ఎన్నికై బాధితులు చేపట్టిన నాటి నుండి ప్రజాసేవకే అంకితమై ప్రజల అభ్యర్థన మేరకు స్థానిక పంచాయతీలోని మౌలిక సదుపాయాల త్రాగునీరు, విద్యుత్, సిమెంట్ రోడ్డు నిర్మాణలు, గ్రామపంచాయతీలోనే తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా ప్రత్యేకత చూపుతూ పంచాయ-ంతీలోని ప్రజల మన్ననలను పొందుతు తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా ఇటీవల చేపట్టిన సిసి రోడ్ నిర్మాణ పనులను తరగతిను పూర్తి చేయాలని సర్పంచ్ వడ్డే రమాదేవి భర్త రాజప్ప కాంట్రాక్టర్లను ఆదేశించారు.

# సమగ్ర శిక్ష సెక్టోరియల్ పోస్టుల భర్తీలో సామాజిక న్యాయం పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి




అనంతపురం, డిసెంబరు 13 (అనంతప్రభ )

గడచిన నాలుగు నెలలుగా జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ ఆఫీసర్ల భర్తీ ప్రహసనంగా మారింది. ప్రజా సంఘాలు ఉద్యోగ సంఘాలు విద్యార్థి సంఘాలు అనేకసార్లు సామాజిక న్యాయం పాటించమని నెత్తి నోరు మొత్తుకున్నప్పటికీ అధికారులు తమ అనుకున్నది చేసి ఎస్సీ ఎస్టీలకు ఇతర బలహీన వర్గాలకు ఎలాంటి న్యాయం చేయకుండా వారిని అనర్హులుగా ప్రకటించి, అస్మదీయులకు పెద్దపీట వేసి, జాబితా తయారు చేసి ఎంపిక జాబితాను విద్యాశాఖ కమిషనర్ ఎస్పిడి ఆమోదం కొరకు పంపినట్లు తెలిసింది.ఈ జాబితాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించకూడదు.

గతంలో పనిచేసి అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొన్న వారిని ఎంపిక చేసినట్లు తెలిసింది.గతంలో ఇక్కడ పనిచేసిన డీఈఓ వరలక్ష్మి అవినీతి కార్యక్రమాలకు పరాకాష్ట ఆ ఎంపిక జాబితా.వాస్తవానికి ఆమెపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి, కానీ అలా కాకుండా నెలలు సాగదీసి పాత జాబితానే ఆమోదించే ప్రయత్నం చేయడం గర్హనీయం.

జిల్లా కలెక్టర్ గారు జిల్లా అత్యున్నత అధికారి, జిల్లా మెజిస్ట్రేట్ ఆ గౌరవం అందరికీ ఉంది కానీ ఈ ఎంపిక జాబితా విషయంలో కలెక్టర్ గారు దృష్టి సారించకపోవడం, అవినీతి అధికారుల ప్రతిపాదనలకే సయ్యనడం సబబుగా లేదు.

కనుక ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు, ఎంపీ గారు శాసనసభ్యులందరు ఈ అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా అభ్యర్థిస్తున్నాము.

అక్రమాలతో అధికారుల రూపొందించిన అస్మదీయుల జాబితాను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నాము.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముత్యాల రాజు రాష్ట్ర స్టీరింగ్ కమిటీ రామకృష్ణ జిల్లా గౌరవ అధ్యక్షులు కోటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# ఎస్సై వెంకట స్వామి విధుల నుంచి తప్పించి విచారణ చేపట్టండి

## ఆధారాలు సిద్ధం.. విచారణ ఆలస్యం



ఫిర్యాదు దారుడు మాలపాటి శ్రీనివాసులు

ఉరవకొండ, డిసెంబరు 13 (అనంతప్రభ )

ఉరవకొండ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గా పని చేస్తున్నటి వెంకటస్వామి హయాంలో జరిగిన అనేక నేర సంఘటనలపై ఉన్నతాధికారిచే విచారణ జరిపించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ డి జీ పీ ద్వారకా తిరుమలరావుకు గురువారం నవంబర్ 7న మాలపాటి శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. జిల్లా సమాచార హక్కు చట్టం కార్యదర్శి మీనుగ మధుబాబు, శ్రీనివాసులు మాట్లాడుతూ ఆయనను తక్షణమే విధులనుంచి తప్పించి 25 నేర ఘటనలపై విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలని మాలపాటి శ్రీనివాసులు, మధుబాబు జిల్లా ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. 25 నేర ఘటనలకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని విచారణ ఆలస్యమని మాలపాటి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎస్సై వెంకటస్వామి వైసీపీ పార్టీకి తొత్తుగా తాబేదారుగా వ్యవహరించారని శ్రీనివాసులు ఆరోపించారు. ఆయన హయాంలో అనేక నగదు అపహరణ కేసులు, బంగారం చోరీ, పందులు, పొట్టేలు, ఆవులు గేదేలు, వ్యవసాయ పరికరాలు, రేషన్ దందా, షాపులు బద్దలు కొట్టి చోరీలు, లెక్కలేని చోరీలు, గ్రామాల్లోశాంతి భద్రతలు క్షీణించిఅనేక గడ్డివాముల దగ్ధం,డ్రిప్పు పరికరాల ధ్వంసం లాంటి అనేక అసాంఘిక కార్యక్రమాలు జరిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన ఘటనల్లో వరుస కథనాలు, వార్తాంశాలు ప్రచురించినందున ఎస్సై వెంకటస్వామి మనసులో దురుద్దేశం ఉంచుకొని ఇద్దరూ పోలీసుల చేత అసత్య ఆరోపణలతో తనపై కేసు నమోదు చేయించి, అధికారం దుర్వినియోగపరిచిన ఘటనలపైసమగ్ర విచారణ జరిపించి, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని మాలపాటి శ్రీనివాసులు, మధుబాబు జిల్లా ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు

# ఘనంగా యువ నాయకుడి జన్మదిన వేడుకలు..



పామిడి, డిసెంబరు 13 (అనంతప్రభ )

గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పుట్టినరోజు సందర్భంగా పామిడి పట్టణంలోని స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి తెలుగుదేశం పార్టీ నాయకులందరూ కలిసి కేక్ కటింగ్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని పేషెంట్లకు బ్రెడ్డు మరియు ఫలహారాలను ఇవ్వడం జరిగింది. ఎద్దులపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు భోజన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది, అంతేకాకుండా పాల్యం గ్రామంలో అయ్యప్ప స్వామి వారికి భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి దాదాపు 6 నెలల గడువు కాలంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని, ఉపాధి కల్పనా దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కృషి చేస్తున్నారని, అంతేకాకుండా గుంతకల్లు నియోజకవర్గం లోని పామిడి మండలంలో సీసీ రోడ్ల ఏర్పాటు, పట్టణంలోని రోడ్డు విస్తరణ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఈ సందర్భంగా తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బొల్లు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌస్ పీరా, గుత్తి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, జింకల రామకృష్ణ, కొట్టం మాలిక్, బొమ్మ మోహన్, శివ, కరూర్ శివ, డీలర్ జాఫర్ మరియు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది..

# అనంత రైతాంగాన్ని ఆదుకోండి

ఐదవ పేజి తరువాయి

అందించలేదు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులపై ఒక్క రూపాయి కూడా ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వమే నోటిఫైడ్ పంటలకు 'డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా' పథకం కింద బీమా రక్షణ కల్పించింది. ఒక సీజన్‌లో జరిగిన పంట నష్టానికి మరుసటి ఏడాది అదే సీజన్ ప్రారంభంలోనే క్రమం తప్పకుండా పరిహారం అందించింది. కానీ నేడు కూటమి ప్రభుత్వం 'ఉచిత పంటల బీమా'కు మంగళం పాడింది. రైతుల నుంచి ప్రీమియం కట్టించుకుంటూ భారం మోపుతోంది. అదేవిధంగా ఖరీఫ్ 2023-24 సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా ప్రీమియంను కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించలేదు. విత్తనం నుంచి విక్రయం వరకు అన్నదాతలకు అండగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా రైతాంగాన్ని మోసం చేసింది. ప్రతి అడుగులోనూ రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు 'అన్నదాతకు అండగా వైఎస్ఆర్‌సీపీ' కార్యక్రమాన్ని నిర్వహించాం. రైతులకు నష్టం చేకూర్చే విధానాలను ప్రభుత్వం వీడి తక్షణం ఆదుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోర-ంతోంది" అని పేర్కొన్నారు.

డిమాండ్లు :

1. కూటమి నేతలు హామీ ఇచ్చిన మేరకు 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు అందజేయాలి. 2. వరి, వే-రుశనగ, మొక్కజొన్న, కంది, ఆముదం, పత్తి తదితర పంట ఉత్పత్తులను మద్దతు ధరలకు అనుగుణంగా కొనుగోలు చేయాలి. ఇందుకోసం తక్షణం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. 3. రైతులపై ప్రీమియం భారం వేయకుండా 'ఉచిత పంటల బీమా'ను పునరుద్ధరించాలి. 4. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేయాలి. 5.ఖరీఫ్ 2023-24 సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా కింద పరిహారం తక్షణం చెల్లించాలి. 6. 2023 రబీలో కరువు జాబితా ప్రకటించిన 17 మండలాల రైతులకు రూ.32 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని వెంటనే ఇవ్వాలి. 7. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థలో దళారుల ప్రమేయాన్ని అరికట్టాలి. 8. రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే విత్తనాలు, ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్‌ను ఎమ్మార్పీ ధరకే అందించేలా చర్యలు తీసుకోవాలి

# ఎస్సీ వర్గీకరణలో క్రిమిలేయర్ చేస్తే సహించేది లేదు ఎమ్మార్పీఎస్ కేఎస్ బాబు వర్గం



అనంతపురం, డిసెంబరు 13 (అనంతప్రభ )

అనంతపురం ఈరోజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తమ హక్కుల కోసం పోరాడిన కి. శే. కే. ఎస్. బాబు మాదిగ తనయుడు కే. ఎస్. సువార్ధన్ రాజు మరియు తమ వర్గ బృదాం కలసి ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ వారికి ఎస్సీ వర్గీకరణ చేయాలని తెలుగు రాష్ట్రాల నుండి తొలిసారిగా సుప్రీంకోర్టులో సివిల్ ఆపిల్.5586 %శిట% 2010 లో కేసు వేసిన సంఘమని కమిషన్ దృష్టికి తెస్తూ

ఎస్సీ రిజర్వేషన్ లో క్రిమి లేయర్ లేకుండా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మరియు వివిధ అంశాలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని ఎల్లేష్ మాదిగ హైదరాబాద్ జిల్లా ఎమ్మార్పీపాలుగోన్నారు.ఎస్ ఉపాధ్యక్షులు జి శీను మాదిగ. కే. ఎస్. సువార్ధన్ రాజు

# నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

## తహాశీల్దారు మహబూబ్ బాషా



కూడేరు, డిసెంబరు 13 (అనంతప్రభ )

కూడేరు మండలం స్థానిక మండల పరిధిలోని పలు గ్రామాల సాగునీటి ఆయకట్టు చెరువుల పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి శుక్రవారం వారం రోజున తహశీల్దారు మహబూబ్ బాషా గ్రామస్థాయి, మండల స్థాయి అధికారులతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అరవకూరు, ఇప్పేరు, రామచంద్రపురం మరుట్ల చెరువుల సాగునీటి వినియోగదారుల సంఘాలకు శనివారం రోజున రాష్ట్ర కూటిమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు, తహశీల్దార్ వాటి నిర్వహణపై ఎన్నికల సిబ్బందితో అవగాహన సమీక్ష ను నిర్వహించారు.ఈ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ,ఈ కార్యక్రమంలో ఇంచార్జ తహశీల్దార్ మహబూబ్ బాషా, డిప్యూటీ తహశీల్దార్ సూర్య ప్రతాప్ యాదవ్,రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్,ఎంపీడీవో ,ఈ ఓ ఆర్ డి ,ఏవో విజయ్ కుమార్,ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# వికలాంగురాలు లక్ష్మికి నిత్యవసర సరుకులు పంపిణీ





ఆత్మకూరు, డిసెంబరు 13 (అనంతప్రభ )

ఆత్మకూరు మండలం స్థానిక మండల మండల పరిధిలోని సింగంపల్లి గ్రామానికి చెందిన నిరుపేద వికలాంగు రాలైన లక్ష్మీ కి వాల్మీకి సాధికారత అధ్యక్షులు కందుల ఓబుళపతి మండల సమైక్య సభ్యులు సంఘ సభ్యులు అందరూ కలిసి మానవ దృక్పధముతో గురువారం రోజున నిత్యవసర సరుకులు అందజేయడం జరిగినది.

# జీవో 145 వ్యతిరేకంగా న్యాయవాదుల దీక్ష లు

## -యస్ యఫ్ ఐ సంఘీభావం




ఉరవకొండ, డిసెంబరు 13 (అనంతప్రభ )

అనంతపురం జిల్లా కోర్టు ఆవరణలో యండీ పి యస్ చట్టం క్రింది నేరాలను విచారించుటకు 5 ప్రత్యేక న్యాయస్థానములను ఏర్పాటు చేయుటకు ప్రభుత్వము జారీ చేసిన జీవో . 145 కు వ్యతిరేకంగాశుక్రవారం అనంతపురం బార్ అసోసియేషన్ రిలే నిరాహార దీక్షలు చేపట్టింది.ఈ నిరాహార దీక్షలో జి.ఈరమసప్ప, ఎమ్. సతీష్ కుమార్, డి. సూర్యచంద్ర యదవ్ జి.సి. ప్రకాష్, ఎమ్. చంద్ర శేఖర్, ఎమ్. లోకేష్, ఏ . శ్రీకాంత్, టి. సురేష్, వంశీ నాయక్, బి. గౌతమ్ రాజు, బి. పెద్దిరెడ్డి, సి. అశోక్, ఎమ్.పురుషోత్తం, ఎస్. సుదర్శన్ రెడ్డి,సూర్య తేజ,రమేష్ కృష్ణ, నరసింహ న్యాయవాదులు, పాల్గొన్నారు.ఈ కార్యక్రమంకు మద్దతుగా యస్ యఫ్ ఐ ,విద్యార్థి సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు.దీక్షల్లో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిద్దు ,పరమేష్ అనంతపురం నగర అధ్యక్ష కార్యదర్శులు భీమేష్ సోము, తదితరులు పాల్గొన్నారు..











## ఆశ్చర్యపరుస్తున్న హైదరాబాదీ ఇడ్లీ



స్విగ్గీ ఆర్డర్లలో ఇడ్లీయే రాజానండి బాబూ.. అల్పాహారాల్లో ఇడ్లీకి ఉన్న క్రేజ్ అలాంటిదండి మరి..!

ఎందుకటే గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 3.3 కోట్ల ప్లేట్లను ఆ సంస్థ పంపిణీ చేసింది. అల్పాహార ప్రియుల్లో ఆ ఇడ్లీకి ఉన్న క్రేజ్ ఎంతో తన నివేదికలో వివరించింది. అంతేకాదు.. ఈ సిగ్గీ ద్వారానే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి అరుదైన రికార్డు సొంత చేసుకున్నాడు. ఆ విశేషాలంటో చదివేద్దామా?

ఇడ్లీ.. ఇడ్లీ.. ఇడ్లీ.. అవును! ఇడ్లీకి ఉన్న క్రేజే వేరు. పూర్వకాలం నుంచి అల్పాహారంగా దీనినే తీసుకుంటున్నారు. ఇడ్లీ లేని హెూటలూ ఉండదు. బెంగళూరు వాసులు రవ్వ ఇడ్లీలు, చెన్నై వాసులు నెయ్యి, పొడి ఇడ్లీలు ఇష్టపడితే.. హైదరాబాద్ వాసులు కారం పొడి, నెయ్యి, చట్నీలతో కూడిన ఇడ్లీలు ఇష్టపడతారు. అందుకే ఈ ఇడ్లీలకు ఎక్కడైనా డిమాండ్ ఉంటుంది. వీటి ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు.

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ ద్వారా గత ఏడాది కాలంగా రూ.ఆరు లక్షలను కేవలం ఇడ్లీల కోసమే ఖర్చు చేశాడంట. ఇడ్లీలంటే తనకు ఎంత ఇష్టమో ఈ రికార్డు ద్వారా నిరూపించాడు. తన కోసమే కాదు.. తన కుటుంబసభ్యులు, స్నేహితుల కోసం ఏడాది మొత్తంలో 8428 ప్లేట్ల ఇడ్లీలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు.. తాను ఎక్కడికి వెళితే అక్కడ స్విగ్గీలో ఆర్డర్ ఇచ్చేయడం ఈయనకు అలవాటు.

ప్రపంచ ఇడ్లీ దినోత్సవం నాడు ఇడ్లీ ఆర్డర్లపై నిర్వహించిన అధ్యయన నివేదికను స్విగ్గీ సంస్థ విడుదల చేసింది. మరోవైపు ఈ సంస్థ గత ఏడాదికాలంలో దేశవ్యాప్తంగా 3.3 కోట్ల ప్లేట్ల ఇడ్లీలను పంపిణీ చేసినట్టు తెలిపింది. ఆ నివేదిక ప్రకారం ఎక్కువ ఇడ్లీలను ఆర్డర్ చేసిన నగరాల్లో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్టు తెలిపింది.

కోల్‌కతా, కొచ్చి, ముంబై, కోయంబత్తూరు, పుణే, వైజాగ్, ఢిల్లీ నగరాలు నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది స్థానాల్లో ఉన్నాయి. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోయంబత్తూరు, ముంబై వాసులు డిన్నర్‌గా కూడా ఇడ్లీని ఎక్కువ ఇష్టపడుతున్నట్టు స్విగ్గీ తన సర్వేలో వెల్లడించింది.

చాలా మంది రాత్రి పూట టిఫిన్‌చేసే వాళ్లు కూడా ఇడ్లీపైనే మక్కువ చూపిస్తున్నట్టు ఫుడ్ డెలవరీ సంస్థ స్విగ్గీ పేర్కొంది. అయితే అల్పాహార ఆర్డర్స్‌లో మసాలా దోశ మాత్రం ఫస్ట్ ప్లేస్‌లో ఉంటే, ఇడ్లీ దానిని అనుసరిస్తోంది.

## మామిడిపండుతో టేస్టీ అండ్ సింపుల్ రెసిపీలు

సీజనల్ ఫ్రూట్ మామిడిపండు. వేసవిలో మాత్రమే దొరికే ఈ పండును కచ్చితంగా తినమని చెబుతారు పోషకాహార నిపుణులు. విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యూట్రియెంట్లు అధికంగా ఉంటాయి. ఇది తినడం వల్ల మన శరీరం ఇనుమును సులువుగా శోషించుకుంటుంది. జీర్ణ క్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక వ్యవస్థకు మామిడిపండు ఎంతో అవసరం. అలాగే బరువు తగ్గించే డైట్ లో కూడా ఇది ఒక భాగం. వీటిని తింటూ బరువును సులువుగా తగ్గొచ్చు. వైద్యులు కూడా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తింటూ బరువు తగ్గమని సూచిస్తారు. మామిడి పండుతో సింపుల్‌గా చేసుకునే రెసిపీలు ఇవిగో. వీటిని పెద్దగా వండాల్సిన అవసరం లేదు.

మామిడిపండు ఓట్స్ స్మూతీ
ఓట్స్ – రెండు స్పూన్లు
మామిడిపండు – ఒకటి
చియా సీడ్స్ – ఒక స్పూన్
నీళ్లు – ఒక గ్లాసు

తయారీ ఇలా
1. స్టవ్ మీద కళాయియి పెట్టి అందులో ఒక గ్లాసు నీరు వేయాలి.
2. ఆ నీళ్లలో ఓట్స్, చియా సీడ్స్ వేసి ఉడికించాలి అవి మెత్తగా అయ్యాక చల్లారనివ్వాలి.
3. ఈ మొత్తం మిశ్రమాన్ని బ్లెండర్లో వేసి జ్యూస్ లా చేసుకోవాలి. 4. ఆ మిశ్రమాన్ని ఒక గ్లాసులో వేసి పైన మామిడి పండు ముక్కలను వేసుకోవాలి. మామిడి పండు ఓట్స్ స్మూతీ రెడీ అయినట్టే.

కొబ్బరితో మామిడిపండు ఓట్ మిల్
లేత కొబ్బరి – 50 గ్రాములు
కొబ్బరి పాలు – అర గ్లాసు
ఓట్స్ – అర కప్పు
మామిడిపండు ముక్కలు – అరకప్పు
డ్రై ఫ్రూట్స్ తరుగు – గుప్పెడు
తేనె – ఒక స్పూను
యాలకుల పొడి – చిటికెడు

1. ఒక గిన్నెలో పైన చెప్పిన అన్ని పదార్థాలను వేసి బాగా కలిపి రాత్రంతా ఉంచాలి.
2. గిన్నెపై మూత పెట్టడం మర్చిపోవద్దుచ లేదా ఫ్రిడ్జ్ లో పెట్టినా మంచిదే.
3. ఉదయం లేచాక వాటిని అల్పాహారంగా తింటే ఆరోగ్యానికి మంచిది. రుచి కూడా అదిరిపోతుంది.



మామిడి సలాడ్
వర్జిన్ ఆలివ్ ఆయిల్ – ఒక స్పూను
పాలకూర – గుప్పెడు
మామిడిపండు – ఒకటి
తేనె – ఒక స్పూను
మిరియాల పొడి– చిటికెడు

1. పాలకూర ఆకులను బాగా కడిగి సన్నగా తురుముకోవాలి.
2. మామిడిపండును కూడా సన్నగా తరగాలి.
3. సలాడ్ చేయడానికి ఒక గిన్నెను తీసుకొని అందులో ఆలివ్ ఆయిల్ వేసి గిన్నె కింద అడుగుభాగానికి బాగా పట్టించాలి.
4. ఆ గిన్నెలో పాలకూర తరుగును, మామిడిపండు తరుగును వేయాలి.
5. వాటిని బాగా కలపాలి. తేనే, పెప్పర్ కూడా చల్లి బాగా కలుపుకోవాలి.
6. ఆలివ్ ఆయిల్‌ను పైన చల్లుకొని సలాడ్ తినాలి.
ఈ మామిడి సలాడ్ కంటికి, చర్మానికి, మెదడుకు, కాలేయ పనితీరుకు మేలు చేస్తుంది.

## దగ్గుతో బాధపడుతుంటే కేవలం 10 నిమిషాల్లో ఇలా సిరప్‌ను ఇంట్లోనే తయారు చేసుకోండి

వాతావరణంతో పాటు వచ్చే రోగాల్లో ముఖ్యమైనవి జలుబు, దగ్గు, జ్వరం, అలెర్జీలు. వీటిలో అతి సాధారణంగా జలుబు, దగ్గు ఎక్కువ మందిని ప్రభావితం చేస్తాయి. మార్కెట్లో దొరికిన దగ్గు సిరప్‌లనే ఎక్కువ మంది వినియోగిస్తారు. అయితే పూర్వం ఈ దగ్గు సిరప్‌లు ఏవి ఉండేవి కాదు. వారు ఇంట్లోనే దగ్గుకు ఔషధాన్ని తయారు చేసుకొని తాగేవారు. కేవలం కొన్ని నిమిషాల్లోనే ఇది తయారైపోతుంది. ఎలాంటి సైడ్ ఎఫెక్టులూ ఉండవు. కాబట్టి సహజ పద్ధతిలో మీరు కూడా ఇంట్లోనే ఇలా దగ్గు సిరప్ తయారు చేసుకొని తాగితే మంచిది.

ఇంట్లోనే దగ్గు ఔషధం తయారీకి ఐదు పదార్థాలు కావాలి. తేనే, మిరియాలు, తులసి, అల్లం,



నిమ్మకాయ వంటి వాటితో ఈ ఔషధాన్ని తయారు చేస్తారు. వీటన్నింటిలో కూడా విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో నొప్పిని, మంటను నయం చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను దూరం చేస్తాయి. చల్లని వాతావరణంలో వచ్చే వ్యాధులతో పోరాడుతాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.

తయారీ ఇలా..
ఈ దగ్గు సిరప్ తయారు చేయడానికి ముందుగా కళాయిని స్టవ్ మీద పెట్టండి. ఆ కళాయిలో ఒక కప్పు నీరు, రెండు టేబుల్ స్పూన్ల అల్లం తరుగు, తరిగిన నిమ్మకాయ ముక్కలను వేయండి. మిశ్రమం సగానికి తగ్గేవరకు చిన్న మంట మీద మరిగించండి. తరువాత అర స్పూను మిరియాల పొడిని జోడించండి. అందులోనే నాలుగు తులసి ఆకులు వేసి మరిగించండి. తర్వాత స్టవ్ కట్టేయండి. గోర-ువెచ్చగా మారాక ఒక స్పూను తేనెను అందులో కలపండి. ఆ మిశ్రమాన్ని ఒక సీసాలో వేసి భద్రపరుచుకోండి. మూడు పూటలా భోజనం చేశాక ఒక టేబుల్ స్పూన్ ఔషధాన్ని తాగండి. ఇలా వారం రోజులపాటు ఈ ఔషధాన్ని సేవిస్తే దగ్గు సహజసిద్ధంగానే తగ్గిపోతుంది. సాధారణంగా వచ్చే దగ్గు అయితే ఈ ఔషధాలకు నయం అవుతుంది. ఈ ఔషధానికి దగ్గు నయం కాకుండా ఉంటే అది తీవ్రమైనదిగా పరిగణించవచ్.చు అప్పుడు వైద్యులను కలిసి అల్లోపతి మందులను వాడండి.

దగ్గు మందుల వల్ల తీవ్రమైన సైడ్ ఎఫెక్టులు వస్తున్నట్టు ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. కొన్ని దేశాల్లో కొన్ని రకాల దగ్గు మందులను నిషేధించారు. దానికి కారణం అందులో వాడుతున్న కొన్ని రసాయన సమ్మేళనాలే. ఇలా ఇంట్లోనే సహజసిద్ధంగా దగ్గు ఔషధాన్ని తయారు చేసుకుంటే, ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవు. చెడు ప్రభావాలు పడవు. ఈ మందు మీకు సరిగా పనిచేయకపోయినా, దీనివల్ల కలిగే నష్టం మాత్రం ఉండదు. కాబట్టి ఒకసారి దగ్గుకు ఈ ఔషధాన్ని తయారు చేసుకొని వాడి చూడండి. మీకు దీని వల్ల దగ్గు తగ్గితే భవిష్యత్తులో అల్లోపతి మందులు వాడాల్సిన అవసరం ఉండదు.

## మామిడిపండుతో మిల్క్‌షేక్.. వెరీ

పాలు ఆరోగ్యానికి చాలా మంచిది. ఏకాలమైనా వీటిని తీసుకోవాల్సిందే. అయితే, ఎండాకాలంలో పాలని వేడిగా తీసుకునే బదులు చల్లగా తాగితే బావుంటుంది కదా. అందుకే బెస్ట్ సమ్మర్ స్పెషల్ 5 మిల్క్ షేక్స్ చూడండి. వీటిని మీ డైట్‌లో చేర్చుకోండి.

డేట్ వాల్‌నట్ మిల్క్ షేక్

కావాల్సిన పదార్థాలు..

6 ఖర్జూరాలు 1 టేబుల్ స్పూన్ ఎండు ద్రాక్ష, 5 వాల్‌నట్స్ 1 కప్పు చల్లని పాలు.
తయారీ విధానం.. గిన్నెలో ఖర్జూరం, వాల్‌నట్స్, ఎండుద్రాక్ష వేయాలి. అరకప్పు వేడి నీటిని పోసి వాటిని 15 నిమిషాల పాటు నానబెట్టండి. నీటిని తీసి డేట్స్, వాల్‌నట్స్, ఎండుద్రాక్షలు వేసి బ్లెండ్ చేయండి. 1 కప్పు చల్లని పాలని బ్లెండర్ పోసి బాగా కలపండి. అంతే డేట్ వాల్‌నట్ మిల్క్ షేక్ రెడీ.

యాపిల్ బనానా మిల్క్ షేక్..
కావాల్సిన పదార్థాలు..

1 చిన్న ఆపిల్, 1 అరటిపండు, అర టీస్పూన్ యాలకుల పొడి, 1 కప్పు పాలు, 1 టేబుల్ స్పూన్ తేనె.

తయారీ విధానం..

యాపిల్, అరటిపండు తొక్కని తీసి ముక్కలుగా కట్ చేసి బ్లెండర్‌లో వేయండి. ఇప్పుడు తేనె, యాలకుల పొడి కూడా వేయాలి. దీనంతటిని మెత్తగా మిల్క్‌షేక్‌లా అయ్యే వరకూ బ్లెండ్ చేసి సర్వ్ చేయడమే.

మ్యాంగో మిల్క్ షేక్..
కావాల్సిన పదార్థాలు..
1 మామిడి పండు 1 కప్పు పాలు, 5 జీడిపప్పులు, 1 టేబుల్ స్పూన్ తేనె, చిటికెడు కుంకుమ



పువ్వు, తయారీ విధానం..

ఇప్పుడు బ్లెండర్‌లో మామిడిపండు, పాలు, జీడిపప్పు, చక్కెర, కుంకుమపువ్వు వేయండి. మెత్తగా షేక్‌ల చేయండి. దీనిని గ్లాసులో పోసి మామిడి పండు ముక్కలతో గార్నిష్ చేయండి.

డ్రై ఫ్రూట్ మిల్క్ షేక్..

డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచిది. అందుకే, సమ్మర్‌లోనూ వీటిని షేక్స్‌లో వాడొచ్చు. అందుకోసం ఏమేం కావాలంటే..

10 జీడిపప్పులు, 5 బాదంపప్పులు, 5 పిస్తా పప్పులు 1 టీ స్పూన్ నానబెట్టిన ఎండుద్రాక్ష, 1 కప్పు పాలు 2 టీ స్పూన్ చక్కెర మీరు మరింత హెల్దీగా తాగాలనుకుంటే తేనె కూడా తీసుకోవచ్చు. చిటికెడు కుంకుమపువ్వు.
తయారీ విధానం.. ఓ గిన్నెలో జీడిపప్పు, బాదం, పిస్తా వేసి పావు కప్పు పాలు పోసి 10 నిమిషాలు నాననివ్వండి. ఇప్పుడు మిగిలిన పాలతో కలిపి బ్లెండ్ చేయండి. ఇప్పుడు కుంకుమపువ్వు, తేనె కూడా వేసుకి మెత్తగా మిల్క్ షేక్ చేసుకోండి. అంతే టేస్టీ మిల్క్ షేక్ రెడీ అయినట్లే.

## వేసవి తాపాన్ని తగ్గించి చల్లగా ఉంచే సూపర్ ఫుడ్స్



సూర్యుడి నెత్తి మీదకు చేరి చెమటగా మారి నాట్యమాడేస్తున్నాడు. వేసవి ఉక్కపోత నుంచి బయట పడటం చాలా కష్టం. కొంతమందికి అయితే చెమటలు కారుతూనే ఉంటాయి. ఫ్యాన్, ఏసీ, కూలర్ ముందే కూర్చుని సేద తీరతారు. చల్లని ఐస్ క్రీమ్స్, డ్రింక్స్ తాగితే పొట్ట కూడా హాయిగా ఉంటుంది.
కొన్ని ఆరోగ్యకరమైన ఆహారాలు ఈ వేసవిలో శరీరానికి సరిపోకపోవచ్చు. కానీ కొన్ని మాత్రం శరీరాన్ని చల్లగా ఉంచుతాయై. వేడిని సహజంగా తగ్గించడంలో మీకు సహాయపడే కొన్ని సూపర్ ఫుడ్స్ ఇవే. వీటిని తీసుకుంటే మండే ఎండలో కూడా చల్లగా ఉండవచ్చు.

◉ ఖుస్ గడ్డి నుంచి తయారు చేసేది ఖుస్ షర్బత్. ఇది మిమ్మల్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. అధిక వేడి వల్ల కళలు ఎర్రగా మంటలు అనిపిస్తాయి. ఆ ఫీలింగ్ తగ్గాలంటే ఖుస్ షర్బత్ తాగాల్సిందే.

◉ శరీరాన్ని చల్లబరిచే మరొక అద్భుతమైన పదార్థం సబ్జా. ఒక బాటిల్ నీళ్ళలో సబ్జా గింజలు వేసుకుని తాగుతూ ఉంటే చాలా బాగుంటుంది.

◉ కోకుమ్ జ్యూస్ తాగితే శరీరంలోని వేడి, మంట తగ్గించడానికి ఇదొక గొప్ప మార్గం. శరీరాన్ని చల్లబరుస్తుంది. నిర్జలీకరణాన్ని తగ్గిస్తుంది. వడదెబ్బ నుంచి రక్షణగా నిలుస్తుంది.


◉ బార్లీ నీరు నిర్జలీకరణాన్ని నివారించడంలో సహాయపడుతాయి. పుదీనా, కొత్తిమీర ఆకులు శరీరంలోని వేడిని తొలగిస్తాయి. శరీరంలోని వ్యర్థాలను తొలగించేస్తాయి.

ఇవి మీకు చల్లదనాన్ని మాత్రమే కాదు ఆరోగ్యాన్ని ఇస్తాయి. వేసవిలో ఈ ఉత్తమమైన ఆహారాలు చాలా తేలికగా ఉంటాయి. మిమ్మల్ని రిఫ్రెష్ గా ఉంచుతాయి. వేడిని దూరం చేస్తాయి. ఇవే కాదు కాలానుగుణమైన పండ్లు, కూరగాయలు తీసుకుంటే దాహాన్ని తీర్చేస్తాయి. ఇవే కాదు కొబ్బరి నీళ్ళు, పుచ్చకాయ, మజ్జిగ, కొత్తిమీర ఆకులు, పుదీనా ఆకులు, కీరదోస తీసుకున్నా మంచిది. కొబ్బరి నీళ్ళు తీసుకోవడం వల్ల శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ ని తిరిగి భర్తీ చేస్తుంది. తక్షణ శక్తిని అందిస్తుంది.

AP 4PG 14 12 2024 saturday qxp_Layout 1 13-12-2024 09:35 PM Page 4



# వన్ అండ్ ఓన్లీ రష్మిక .. ఒకే నెలలో రెండు 900 కోట్ల సినిమాలతో ఏ హీరోయిన్‌కి లేని రికార్డ్

ప్రస్తుతం భారతీయ చిత్ర పరిశ్రమలో ఉన్న టాప్ మోస్ట్ హీరోస్ లిస్ట్ లో మన సౌత్ హీరోల పేర్లే ఎక్కువ కనిపిస్తాయి. వీరితో పాటుగా ఇండియన్ సినిమా టాప్ అండ్ బిజీ హీరోయిన్స్ లిస్ట్ తీసినా హిందీ హీరోయిన్స్ పేర్లు ఎక్కువ రావచ్చు కానీ ఒక్క హీరోయిన్ డామినేషన్ మాత్రం మామూలు లెవెల్లో లేదని చెప్పాలి. కాగా ఆ హీరోయిన్ నే నేషనల్ క్రష్ రష్మికా మందన్నా..

రష్మిక పరిచయం అవ్వడానికి సౌత్ నుంచే అయ్యినప్పటికీ ఇపుడు పాన్ ఇండియా సినిమాని రూల్ చేస్తుంది. కాగా రష్మిక హీరోయిన్ గా ఇపుడు చేస్తున్న లేటెస్ట్ చిత్రాలు చాలానే ఉన్నాయి కానీ తాను నటించిన లేటెస్ట్ భారీ చిత్రం ఒకటి మాత్రం ఇండియన్ సినిమాని షేక్ చేస్తుంది. ఆ సినిమానే పుష్ప 2 ది రూల్.

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా దర్శకుడు సుకుమార్ కాంబినేషన్ లో వచ్చిన ఈ చిత్రంలో రష్మిక తన పెర్ఫామెన్స్ తో పాటుగా బోల్డ్ హాట్ షోతో కూడా ఓ రేంజ్ లో అలరించింది. కాగా ఈ సినిమాతోనే రష్మికా తన కెరీర్‌లో మొట్టమొదటి 1000 కోట్ల క్లబ్‌లో చేరిన సినిమాలో నటించిన హీరోయిన్‌గా నిలిచారు. అయితే ఆమె ఇపుడు టోటల్ ఇండియన్ సినిమా దగ్గర ఒక ఇంట్రెస్టింగ్ అండ్ సెన్సేషనల్ రికార్డు తాను తన ఖాతాలో వేసుకున్నట్టుగా ఇపుడు తెలుస్తుంది.

ఒక్క ఏడాది వ్యవధిలో అది కూడా ఒకే నెలలో యాదృచ్ఛికంగా ఆమె నటించిన సెన్సేషనల్ పెర్ఫామెన్స్ చిత్రాలు 900 కోట్లకి పైగా గ్రాస్ ని అందుకొని సంచలనం సెట్ చేసాయి. దీనితో ఇండియన్ సినిమా దగ్గర రష్మిక మందన్నాకి ఈ బోగ్ రికార్డు సొంతం అయ్యింది అని చెప్పాలి. మరి ఒక 900 కోట్ల సినిమా లేటెస్ట్ పుష్ప 2 అని అందరికీ తెలుసు. కానీ మరో సినిమా ఏదంటే .. సరిగ్గా ఇదే డిసెంబర్ 2023లో విడుదల అయ్యిన చిత్రం యానిమల్.

బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ నటించిన ఈ చిత్రాన్ని తెలుగు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించారు. ఇలా ఒకే నెలలో రెండు సార్లు 900 కోట్ల బాక్సాఫీస్ కలెక్షన్స్ కొట్టిన వన్ అండ్ ఓన్లీ హీరోయిన్ గా ఇపుడు ఇండియన్ సినిమా దగ్గర నేషనల్ క్రష్ నిలిచింది. అంతేకాదు.. ఈ రెండు సినిమాల్లో కూడా హీరోలు రష్మిక కాళ్ళ దగ్గరే వచ్చారు అని మరో క్రేజీ కో ఇన్సిడెంట్ కూడా కలిసిన సంగతి అందరికీ తెలిసిందే. దాని తర్వాత బాక్సాఫీస్ దగ్గర కూడా ఇలా కలవడం గమనార్హం.

ఇక రష్మిక నుంచి ఇది మాత్రమే కాకుండా రానున్న రోజుల్లో పాన్ ఇండియా లెవెల్లో మరిన్ని చిత్రాలు ఉన్నాయి. వీటిలో ధనుష్ తో కుబేర.. అలాగే హిందీలో సల్మాన్ ఖాన్ మురుగదాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న సికందర్. అలాగే మరిన్ని ఇతర సినిమాలు చేస్తూ రష్మిక బాలీవుడ్ హీరోయిన్స్ కి సైతం గట్టి పోటీని ఇస్తూ టాప్ రేంజ్ లో దూసుకెళ్తుంది. ప్రస్తుతానికి పుష్ప 2 సక్సెస్‌ని రష్మిక ఎంజాయ్ చేస్తున్నారు.

# బ్లూ కలర్ డ్రెస్‌లో రకుల్ స్టన్నింగ్ లుక్..




సాధారణంగా ఆర్మీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న కుటుంబంలో అంతా ఎంత స్ట్రిక్ట్‌గా ఉంటారో తెలిసిందే. అలాంటి ఫ్యామిలీ నుంచి వచ్చి టాప్ హీరోయిన్‌గా ఎదిగారు రకుల్ ప్రీత్ సింగ్. ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అనతికాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ అందుకున్నారు రకుల్. ప్రస్తుతం తెలుగు తెరకు దూరంగా హిందీలోనే తన అదృష్టం పరీక్షించుకుంటున్నారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

10 అక్టోబర్ 1990న పంజాబీ సిక్కు కుటుంబంలో న్యూఢిల్లీలో జన్మించారు రకుల్ ప్రీత్ సింగ్. ఆమె తండ్రి కుల్వీందర్ సింగ్ ఆయన ఆర్మీలో ఆఫీసర్.. తల్లి రాజేందర్ కౌర్. ధౌలా కౌన్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం, ఢిల్లీలోని జీసస్ అండ్ మేరి కాలేజీలో మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు రకుల్. క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడే తత్వాన్ని తన పేరెంట్స్ నుంచే నేర్చుకున్నానని రకుల్ ఎన్నో వేదికలపై తెలిపారు ఈ ముద్దుగుమ్మ. వారే తనకు ఇన్స్‌పిరేషన్ అని.. జీవితంలో అనుకున్నది సాధించడానికి తనను వెన్నుతట్టి ప్రోత్సహించారని తన తల్లిదండ్రుల గురించి గొప్పగా చెబుతుంటారు.

అందరూ నటనపై ఆసక్తితోనో, ప్యాషన్‌తోనో సినీ పరిశ్రమలో అడుగుపెడుతుంటారు. అయితే రకుల్ మాత్రం కేవలం పాకెట్ మనీ కోసం ఇండస్ట్రీలో అడుగుపెట్టారట. తొలుత కన్నడంలో గిల్లి సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన రకుల్.. తర్వాత మోడలింగ్‌లో దుమ్మురేపారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో తెలుగువారిని పలకరించారు . ఈ సినిమాలో ఆమెకు నేమ్ అండ్ ఫేమ్ వచ్చింది . వచ్చిన ప్రతి అవకాశాన్ని అందుకుంటూ టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందారు. చిన్నా, పెద్దా అందరికీ రకుల్ ప్రీత్ సింగే హీరోయిన్‌గా కావాలి అన్నంతగా బలమైన ముద్రవేశారు.

టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలోనూ ఛాన్స్‌లు పట్టేసింది రకుల్. తన సంపాదనను తెలివిగా పలు వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి రెండు చేతులా సంపాదిస్తున్నారు. బాలీవుడ్ నటుడు, నిర్మాత అయిన జాకీ భగ్నానితో కొన్నాళ్లు డేటింగ్ చేసిన రకుల్ ప్రీత్ సింగ్ ఆయనను పెళ్లాడారు. ప్రస్తుతం హిందీలో దే దే ప్యార్ దే 2లో నటిస్తున్నారు. అన్షుల్ శర్మ దీనికి దర్శకుడు కాగా వచ్చే ఏడాది మార్చిలో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నారు.

# ధనుష్‌తో కాంట్రవర్సీపై నయనతార ఓపెన్ క్లారిటీ .. ఇంత జరిగినా తగ్గట్లేదుగా




రీసెంట్‌గా సౌత్ ఇండస్ట్రీలో ఓ రేంజ్‌లో హైలైట్ అయిన పలు అంశాల్లో భారీ సినిమాల విడుదలలు మాత్రమే కాకుండా వాటితో పాటుగా పలు క్రేజీ కాంట్రవర్సీలు కూడా స్పెషల్ అటెన్షన్ ని తెచ్చుకున్నాయి . వీటిలో కొన్ని రోజులు అయినా మాంచి ఎంటర్టైన్మెంట్‌ని ఇచ్చిన కాంట్రవర్సీ మాత్రం తమిళ స్టార్ హీరో అండ్ హీరోయిన్లు ధనుష్ , నయనతారల కాంట్రవర్సీ అని చెప్పాలి.

భారీ మొత్తంలో డబ్బులకి తన పెళ్లి డాక్యుమెంటరీ హక్కులను పాపులర్ ఓటిటి సంస్థ నెట్ ఫ్లిక్స్‌కి అమ్ముకున్న సంగతి తెలిసిందే. ఈ డాక్యుమెంటరీలో ధనుష్ నిర్మాణం వహించిన నానుమ్ రౌడీ దాన్ సినిమా తాలూకా విజువల్స్ ఒక మూడు సెకండ్స్ పాటు కనిపించడంతో ధనుష్ లీగల్ గా తన సినిమా కాపీ రైట్ ఇష్యూ రైజ్ చేసి నయన్ కి షాకిచ్చాడు.

అయితే ధనుష్ సైలెంట్ గానే నోటీసులు పంపితే దానిని నయనతార ఓపెన్ గా పెద్ద ప్రెస్ నోట్ రిలీజ్ చేసి బహిర్గతం చేసింది. ఇక అక్కడ నుంచి ఇద్దరి నడుమ మంచి మసాలా స్టార్ట్ అయ్యింది. మొదట నయన్‌కి చాలా మంది సపోర్ట్ చేసినప్పటికీ నెమ్మదిగా ధనుష్‌కి పాజిటివిటీ పెరగడం మొదలైంది. ఇలా ఇద్దరి నడుమ రగడ పెరుగుతూ వెళుతుంది.

మరి ధనుష్ తనకి 10 కోట్లు కట్టాలని నయన్‌ని ఇరికిస్తే నయన్ ఏమో ఇన్ డైరెక్ట్ గా పలు వార్నింగ్స్ కూడా ఇచ్చేది. ఇలా ఈ హైడ్రామా ఇపుడు ఒక రియాలిటీకి వస్తుంది. లేటెస్ట్‌గా నయనతార ఈ కాంట్రవర్సీపై డైరెక్ట్‌గానే ఓపెన్ అయ్యింది. తాను ఏం చెప్తుందంటే.. తాము డాక్యుమెంటరీ సమయంలోనే ఆ సినిమా విజువల్స్ కోసం ధనుష్ ని అప్రోచ్ కావడానికి ట్రై చేసాం అని నయన్ తెలిపారు. తన దగ్గర నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుందాం అనే అనుకున్నాము కానీ అతను అందుబాటులో లేడు అని చెప్పింది.

అలాగే తాము ఆ సినిమా నుంచి కేవలం నాలుగు లైన్స్ మాత్రమే తీసుకుందాం అనుకున్నాము కానీ అది కూడా కుదరలేదు. అయినా తమ డాక్యుమెంటరీలో చూపించిన విజువల్స్ కూడా అప్పుడు యూనిట్ సభ్యులు సెల్‌ఫోన్ కెమెరాతో చిత్రీకరించినవి మాత్రమేనని నయనతార తెలిపారు. ఇవి కేవలం షూట్ మధ్యలో విజువల్స్ అని.. వాటికి కూడా అభ్యంతరం చెప్పడం తనకు నచ్చలేదు అన్నట్టు వ్యాఖ్యానించింది

ధనుష్ తమకి మంచి ఫ్రెండ్ అయినప్పటికీ ఇలా జరిగిపోయింది అని నయనతార తెలిపారు. అయినా తాను భయపడటం లేదని.. నేను ఏదన్నా తప్పు చేస్తే భయపడాలి తప్ప.. నేను తప్పు చెయ్యలేదు కాబట్టి భయపడను అని ఈ వివాదంపై కీలక కామెంట్స్ చేసింది. దీనితో వీరి కాంట్రవర్సీలో ఫైనల్ గా ధనుష్ పై కామెంట్స్ చేయడం కోలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఇది పక్కన పెడితే ధనుష్ , నయనతారలు పలు చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారు.

# వికటకవి వెబ్ సిరీస్ రివ్యూ అండ్ రేటింగ్

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలోని అమరగిరి ప్రాంతంలోని దేవతల గుట్ట ఆటవీ ప్రాంతంలో మిస్టరీగా ప్రజలు జ్ఞాపకశక్తి కోల్పోయి గతం కోల్పోతుంటారు. ఈ మిస్టరీని ఛేదించడానికి ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన విద్యార్థి రామకృష్ణ (నరేష్ అగస్త్య) డిటెక్టివ్ అవతారం ఎత్తి అమరగిరి చేరుకొంటాడు.

అమరగిరి గ్రామస్థులు ఎందుకు గతాన్ని మరిచిపోతుంటారు? దేవతల గుట్టలో అగ్ని వర్షం కురువడానికి దేవత శాపమే కారణమా? ఇంతకు రామకృష్ణ ఎవరు? అమరగిరికి రామకృష్ణ ఎందుకు వెళ్లాడు? రామకృష్ణను ఆ గ్రామ పెద్ద రాజ నర్సింహా రావు (సిజ్జు), ఎమ్మెల్యే రఘుపతి (రఘు కుంచె) ఎందుకు అడ్డుకున్నారు? మహాదేవ్ (తారక్ పొన్నప్ప)కు రామకృష్ణ ఉన్న రిలేషన్ ఏమిటి? లక్ష్మి (మేఘా ఆకాశ్)తో ప్రేమ బంధం ఎలా సాగింది? సౌత్ పాకిస్థాన్ ఏర్పాటు లక్ష్యంగా అజయ్ ఖాన్ చేసిన దుష్ట ప్రయత్నాలను రామకృష్ణ ఎలా తిప్పికొట్టాడు? అనే ప్రశ్నలకు సమాధానమే వికటకవి వెబ్ సిరీస్ కథ.

వికటకవి కథ విషయానికి వస్తే.. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం బ్యాక్ డ్రాప్‌తో స్టోరీ 70వ దశకంలో ప్రారంభమవుతుంది. అటవీ ప్రాంతంలో ఓ ప్రదేశానికి వెళ్లిన వారంతా గతాన్ని మరిచిపోవడమనే పాయింట్‌తో ప్రేక్షకుడిని కథలోకి దర్శకుడు ప్రదీప్ మద్దాలి తీసుకెళ్లిన తీరు బాగుంది. చిన్న చిన్న ట్విస్టులతో ప్రతీ ఎపిసోడ్‌లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేసిన విధానం బాగుంది. ఫ్లాష్ బ్యాక్‌ను డీల్ చేసిన విధానం, పాత్రలను కథలోకి జొప్పించిన విధానం ఆయన ప్రతిభకు అద్దం పట్టింది. ఎమోషన్స్‌తోపాటు యాక్షన్ పార్టుగా తీర్చిదిద్దిన తీరు మెప్పించేలా ఉంది.

నటీనటుల విషయానికి వస్తే.. రామకృష్ణగా నరేష్ అగస్త్య బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడనే కంటే.. వెబ్ సిరీస్‌ను మొత్తం తన భుజాల మీద మోశాడనే చెప్పాలి. రామకృష్ణగా మాత్రమే కనిపిస్తూ.. మెచ్యూరిటీతో కూడిన నటనను ప్రదర్శించాడు. తన కెరీర్‌లో ఈ వెబ్ సిరీస్ ద్వారా బెస్ట్ ఇచ్చాడనే ఫిలింగ్ కల్పించాడు. రాజాగా సిజ్జు హుందాతనంతో కనిపించాడు. ఎమ్మెల్యే రఘుపతిగా మరోసారి రఘు కుంచె చెలరేగిపోయాడు. పవర్‌ఫుల్ విలనిజంతో నటుడుగా తన రేంజ్ ఏంటో చెప్పకనే చెప్పాడు. మహదేవగా తారక్ పొన్నప్ప, లక్ష్మిగా మేఘా ఆకాశ్, మిగితా పాత్రల్లో కనిపించిన వారాంత ఉత్తమ నటనను ప్రదర్శించారు.

మిస్టరీ, సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌కు ఏం రేంజ్ మ్యూజిక్ కావాలో ఆ స్థాయిలో అజయ్ అరసదా సంగీతాన్ని అందించాడు. సోషబ్ సిద్ధిఖీ సినిమాటోగ్రఫి సిరీస్‌ను రిచ్‌గా మార్చింది. స్టోరీ ఎలిమెంట్స్‌కు తగినట్టుగా కలర్ టోన్ ఉపయోగించిన తీరుతొ సన్నివేశాలు మరింత రిచ్‌గా కనిపించాయి. ఎడిటింగ్ విభాగం పనితీరు బాగుంది. సీజీ వర్క్‌పై మరింత దృష్టిపెట్టాల్సి ఉండాల్సిందనిపిస్తుంది. రజనీ తాళ్లూరి నిర్మాతగా అనుసరించిన ప్రొడక్షన్ వ్యాల్యూస్ హై స్టాండర్డ్స్‌లో ఉన్నాయి.

దేశభక్తి, రూరల్ డ్రామా, మిస్టరీ, సస్పెన్స్, యాక్షన్ తదితర అంశాలను కలబోసి రూపొందించిన థ్రిల్లర్ మూవీ వికటకవి. ఈ మధ్యకాలంలో వచ్చిన వెబ్ సిరీస్‌లో ది బెస్ట్ అనే ఫీలింగ్ కల్పిస్తుంది. యాక్టర్ల పెర్ఫార్మెన్స్, టెక్నిషియన్స్ పనితీరు ఈ సినిమాను అత్యంత బలంగా మార్చాయి. తెలంగాణ డైలాగ్స్ పర్‌ఫెక్ట్ సింక్‌లో పేలాయి. కథాపరంగా, మేఘా ఆకాశ్ క్యారెక్టర్ పరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండేదనిపిస్తుంది. ఓవరాల్‌గా నిరాశపరచకుండా.. మంచి అనుభూతిని కలిగిస్తుంది. జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. మీకు తీరిక ఉన్న సమయంలో చూస్తూ చక్కగా ఎంజాయ్ చేయవచ్చు. డోంట్ మిస్ ఇట్.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com